ప్రజాశక్తి

శనివారం 15 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

అక్రమ అరెస్టులకు

కూటమి ప్రభుత్వం వ్యతిరేకం

- చట్టం తనపని తాను చేసుకుపోతుంది
- మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శ్రీ డోలా బాలా వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో మంత్రి బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులతో కలిసి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవల్ని కొనియాడారు. అనంతరం మంత్రి బాలవీరాంజనేయ స్వామి మీడియాతో మాట్లాడుతూ... వైసిపి నాయకుడు వల్లభనేని వంశీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుని పోయిందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం చేసినట్లు తమ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం లేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విలువలకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై గత ▶ 2లో

నిధులేవీ..?

- జిల్లాకు రూ.10వేల కోట్లు కోరిన సిపిఎం
- కేంద్రం నుంచి పథకాలకు స్పష్టత కరువు
- నిధుల కోసం మంత్రులు ప్రత్యేక దృష్టి పెడితేనే జిల్లాకు మేలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

రోడ్ల మరమ్మతులకు నిధుల్లేవు...చేసిన పనులకూ నిధుల్లేవు... కరెంటు స్థంభాలకూ నిధుల్లేవు.. గతంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలకూ ఇదే పరిస్థితి. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులూ ప్యాకేజీలకు నిధుల్లేవు.. కొత్తగా ఏపనులు చేపట్టాలన్నా కాంటాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో అగ్రిమెంట్లు చేసుకున్న పనులను వదిలేసి కాంటాక్టర్లు పరారీలో ఉన్నారు. నిధుల పరిస్థితి ఇలా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారుతుందా? అనుకుంటే అనుకున్నంత స్థాయిలో మాత్రం ఏమీ కనిపించడం లేదు. ఇటీవల రాష్ట్రంలో పల్లెపండుగ పేరుతో చేపట్టిన పనులకూ నిధుల్లేవంటున్నారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. ఈ బిల్లులైనా ఇవ్వకపోతే తిరగడం కష్టమని నేతలు ఆందోళన చెందుతున్నారు. అన్నిటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అద్దంలో చూపుతున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలూ అమలులోకి రావడంలేదు. ఏంచేయాలో దిక్కుతోచనిస్థితిలో పాలకపక్ష నేతలున్నారు .మంత్రులు మొదలు ఎమ్మెల్యేల వరకూ అందరిదీ ఇదే పరిస్థితి. ద్వితీయశ్రేణి నేతలు పనులు,కాంటాక్టుల కోసం తిరుగుతుంటే వాళ్లకు ఏం చెప్పాలో కూడా తెలియని పరిస్థితి. కొత్తగా ఏ పనులు చేపట్టాలన్నా స్పష్టతలేదు. ఇటీవల కేంద్రం జిల్లాను వెనుకబడిన జాబితాల్లో చేర్చింది. అయితే ఏటా రూ.50 కోట్లు వరకూ ప్రత్యేకంగా నిధులు జిల్లాలకు ఇస్తామని గతంలో ప్రకటించారు. అయితే కేంద్రం నుంచి ఈమేరకు నిధులు వచ్చాయా?అంటే స్పష్టత లేదు. జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన మంత్రులు, జడ్పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలకు సిపిఎం నేతలు వినతిపత్రాలు ఇచ్చారు. జిల్లాకు రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి ఈ నిధులు రాబట్టాలని సూచించింది. వెనుక బడిన జిల్లాగా గుర్తించినందున అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు కూడా రూపొందించాలి. విజన్ డాక్యుమెంటులో చూపిన గణాంకాలు సాధారణంగానే ఉన్నాయి. ఈపాటికే ఉన్న ప్రాజెక్టులను చూపారు. వాటి ద్వారానే మరింత పురోగతి సాధించాలనే లక్ష్యాలను చూపారు. వెనుకబాటును అధిగమించేందుకు



ప్రత్యేక ప్రణాళికలు, పథకాలు పెద్దగా లేవు. ఏం చేయాలన్నా నిధులు కావాలి.అందుకు ప్రణాళికలు, ప్రతిపాదనలు కూడా కావాలి. జిల్లాలో సహజవనరుల ఆధారంగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయి.వాటిపై ప్రణాళికలు రూపొందించడానికి మంత్రులు చొరవ చూపాలి.ప్రతిపక్షంలోఉన్నపుడు చేసిన డిమాండ్లు ఇపుడు వినిపించడం లేదు. ఇచ్చిన అనేక హామీలపై దృష్టిపెట్టినా చాలా ఫలితాలు సాధించవచ్చు. జిల్లాలో విస్తారంగా సముద్రతీరం ఉంది. రామాయపట్నం పోర్టు నెల్లూరు జిల్లాలోకి వెళ్లింది. జిల్లాలోనూ సముద్రతీరం వెంట అభివృద్ధికి ప్రణాళికలు ఆలోచించాలి. నల్లమల అడవులు పెద్దఎత్తున ఉన్నాయి. వీటినుంచి ఎలా లబ్ధి పొందచ్చునేదీ ఆలోచించడం లేదు.పండ్లతోటలు, వాణిజ్య పంటలూ బాగానే పండుతాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెంచుకోవచ్చు. వాటిపై ఎవరూ దృష్టిసారించడం లేదు. ప్రభుత్వం ఆధీనంలో కనీసం ఓ ▶ 2లో

మళ్లీ 'రైతు బంధు'

- రైతులకు ప్రయోజనం
- పంట ఉత్పత్తులపై వడ్డీ లేని రుణాలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గత వైసిపి ప్రభుత్వ హయాంలో అటకెక్కిక రైతుబంధు పథకం మళ్లీ రైతులకు అందుబాటు లోకి వచ్చింది. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించినప్పుడు అమ్ముకునే వెసులుబాటు కోసం గతంలో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. ఈ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. ప్రధానంగా రైతులు తమ ధాన్యాన్ని గోడౌన్‌లలో ఉంచుకుని 6 నెలల వరకూ వడ్డీ లేని రుణాన్ని పొందేవారు. పంటసాగు కోసం తెచ్చిన అప్పులు, ఎరువులు, పురుగు మందుల బకాయిలను ఈరుణం ద్వారా తీర్చుకొనేవారు. ధాన్యానికి తగిన ధర పలికినప్పుడు అమ్ముకునే వారు. జిల్లాలో ధాన్యం దిగుబడులు లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ఈ ఏడాది 70 వేల మెట్రిక్ టన్నుల వరకూ కొనుగోలు చేయించింది. ప్రైవేట్ వ్యాపారులు 75 కిలోల ధాన్యాన్ని రూ.1400 లోపే కొంటున్నారు. ప్రభుత్వం 75 కిలోల కామన్ రకం ధాన్యంకు



బాపట్ల మార్కెట్ యార్డు

బస్తాకు రూ 1,72, గ్రేడ్ ఏ రకం ధాన్యంకు రూ.1,740 చొప్పున మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసింది. ప్రస్తుతం ధాన్యానికి బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. డిమాండ్ కూడా పెద్దగా లేదు. ఇంతకు ముందు తెలంగాణాకు మన ధాన్యం వెళ్ళేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో ఇక్కడి రైతులు ధాన్యాన్ని అమ్ముకుందామంటే గిట్టుబాటు ధర లేదు. అందువల్ల ధాన్యాన్ని గోడౌన్లలో ఉంచి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవాలని రైతులు భావిస్తున్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రైతుబంధు పథకం ఉపయోగకరంగా ఉంది. మార్కెట్ యార్డులో ఉన్న గోడౌన్లలో ధాన్యం దాచుకుంటే ఉంచిన సరకు విలువలో 75 శాతం వరకూ మార్కెటింగ్ శాఖ రుణంగా ఇస్తుంది. లేదంటే రైతు ఉంచే ధాన్యానికి సంబంధించి రూ.2 లక్షల వరకూ రుణం ఇస్తారు.ఆరు నెలల వరకూ వడ్డీ ఉండదు. ఇంకా మరికొన్ని రోజులు ఉంచుకోవాలంటే 6 నెలల తర్వాత మాత్రం తీసుకున్న రుణంపై 12 శాతం వడ్డీ ఉంటుంది. గోడౌన్ అద్దె నామమాత్రంగా ఉంటుంది. బస్తాకు నెలకు రూ.1 తీసుకుంటారు. ఆ అద్దె డబ్బుతో ధాన్యానికి బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. పురుగులు పట్టకుండా చర్యలు తీసుకుంటారు. సహజంగా ధాన్యం గోడౌన్‌లో ఉంచిన ఆరు నెలల లోనే ధర పలుకుతుంది. రైతులు ధాన్యాన్ని అమ్ముకుని తాము తీసుకున్న రుణం చెల్లించవచ్చు. దాంతో వడ్డీ భారం అనేది ఉండదు. ధాన్యం నిల్వ ఉంచితే పాత బియ్యంగా మారుతుంది. వాటికి ▶ 2లో

వైసిపి పాలనలో ప్రజలకు నరకం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఒక్కఛాన్స్ అంటే.. నమ్మి అధికారమిచ్చిన ప్రజలకు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి నరకం చూపారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. కొరిశపాడు మండలంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామమైన యర్రబాలెంలో మంత్రి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధ ప్రాతిపదికన రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఏడు ముంపు గ్రామాల ప్రజలతో మంత్రి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుండ్లకమ్మ ముంపు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాలలు, దేవాలయాల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఐదేళ్లు అధికారం అనుభవించినా... గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వాసితుల మీద జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైసిపి ప్రభుత్వం కనీస కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి చేసిన తప్పులు.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాపాలుగా మారాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రంలో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం యర్రబాలెం ఎస్‌సి కాలనీని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీ వాసులు మంత్రి దష్టికి తీసుకెళ్లారు. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిసి రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి గొట్టిపాటి

నిధులేవీ..?

(మొదటిపేజీ తరువాయి)

కోల్డ్‌స్టోరేజీ కూడా లేదు. సీజన్‌లో ఎక్కువగా దిగుబడి వచ్చే టమోటా, మామిడి పంటలను నిల్వచేసుకునే సదుపాయాలూ లేవు. పొగాకు, సుబాబుల్, శనగ, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలు విస్తారంగా పండుతాయి. వీటిని పండించే రైతులు దివాళా తీస్తుంటే వాటిపై ఆధారపడిన ఫ్యాక్టరీలు పెట్టి ఉత్పత్తులు తయారు చేసే ఐటిసి లాంటి కంపెనీలు మాత్రం కోట్లలో లాభాలు గడించాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాకు రూ.10వేల కోట్లు తేవాలి. వాటితోనే అభివృద్ధి కార్యక్రమాలు, శాశ్వత ఉపాధి పథకాలూ చేపట్టాలి. సాగు, తాగునీరు లక్ష్యాలు నెరవేరాలంటే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలి. అందుకు రూ.2వేల కోట్లు కావాలి. ఇలాంటప్పుడు కేంద్రం నుంచి నిధులు రాబట్టితే దీన్ని పూర్తి చేయవచ్చు. కనిగిరి, దొనకొండ వద్ద పరిశ్రమలపై స్పష్టత లేవు.అన్నీ ప్రవేటుపైనే ఆధారపడి ఆశగా ఎదురుచూస్తున్నారు. కొన్నైనా ప్రభుత్వ రంగంలో పెడితే మరికొందరు పారిశ్రామికవేత్తలు వచ్చే అవకాశాలు న్నాయి. ఏం చేయాలన్నా విజన్ 2047 అంటూ 4పి పద్ధతిలోనే సాగాలనే లక్ష్యంతోనే ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏరంగంలోనూ ప్రయివేటు రంగాల నుంచి పెట్టుబడులు వచ్చేలా లేవు. ఈ పరిస్థితుల్లో వెనుకబాటు కోసం ఇచ్చే నిధులను గట్టిగా రాబట్టుకోవడమే మార్గం.

మళ్లీ 'రైతు బంధు'

మొదటిపేజీ తరువాయి)

మంచి ధర వస్తుంది.

రైతుబంధును సద్వినియోగం చేసుకోవాలి

కె రమేష్ బాబు, జిల్లా వ్యవసాయ,వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి

జిల్లాలో రైతులు తమ ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు 66 వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం కలగిన 66 గోడౌన్లు ఉన్నాయి. జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోడౌన్లలో రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు. ఇప్పటి వరకు అద్దంకి పరిధిలో రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకున్నారు. ఈ పథకం అమలు కోసం జిల్లాకు రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. రైతుబంధు పథకాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకం

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం నాడు వ్యవహరించినట్లు తాము ప్రవర్తిస్తే సగం మంది వైసిపి నాయకులు జైళ్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండేవారని చెప్పారు. పోలీసుల విచారణలో దోషులు అని తేలితేనే వారిని అరెస్టు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హామీలు ఇచ్చిన మేరకు ఏపీలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి స్వామి స్పష్టం చేశారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఏడాది పాటు అమ్మ ఒడిని అమలు చేయలేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాక ముందే పథకాల అమలుపై దుష్ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. వైసిపి ప్రజలు బుద్ధి చెప్పినా నాయకుల పరిస్థితి మారలేదని మంత్రి పేర్కొన్నారు.

చిల్లచెట్ల అక్రమ నరికివేతపై విచారణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడులో శుక్రవారం చిల్లచెట్ల అక్రమ నరికివేతపై ఈవోపీఆర్‌డి కొండపి రఘుబాబు విచారణ చేపట్టారు. ఈ నెల 5వ తేదీన మద్దిపాడులోని విజయ్‌కుమార్ కాలనీలో పంచాయతీ ఖాళీ స్థలంలో చిల్లచెట్లను కొందరు అక్రమంగా కొట్టుకొని తీసుకు వెళుతున్నారని, దీనివలన పంచాయతీ లక్షల్లో ఆదాయం కోల్పోతుందని, సదరు అక్రమ చెట్ల నరికివేతను తక్షణమే నిలుపుదల చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మద్దా లక్ష్మీనారాయణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిలో భాగంగా సదరు పంచాయతీ కార్యదర్శి, సర్పంచిని విచారణ చేశామని చెప్పారు. అవగాహన లోపం వలన జంగిల్ క్లియరెన్స్ జరిగిందని, ఉన్నతాధికారుల అనుమతితో బహిరంగ వేలము ద్వారా విక్రయించి, పంచాయతీ ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకుంటామని సర్పంచి తెలిపినట్లు ఈవోపీఆర్‌డి చెప్పారు. ఖాళీ స్థలాన్ని ఎవరూ ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని రఘుబాబు ఆదేశించారు.



వధూవరులతో ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొమరోలు: పట్టణంలో యరదేశి రంగయ్య కుమార్తె వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల తెలుగుదేశం అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
శనివారం 15 ఫిబ్రవరి 2025

ఆదర్శ నేత దామోదరం సంజీవయ్య

నివాళులర్పించిన ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి-బాపట్ల

ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత బ్యాంకు ఉద్యోగి బండి కళ్ల బాబూరావు అన్నారు. శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పలు సంఘాల ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూల



బాపట్లలో సంజీవయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్యను నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశ్రాంత అధ్యాపకులు గడ్డం ఏలియా మాట్లాడుతూ భారత దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసి వృద్ధాప్య పింఛన్, రిటైర్డ్ టీచర్స్ పెన్షన్ బెనిఫిటి సౌకర్యం కల్పించిన మొదటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.పి నియోజకవర్గ ఇన్చార్జి గుదే రాజారావు, దానియేల్, ఆనందరాజు, చంద్రబాబు పాల్గొన్నారు.



అద్దంకిలో దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి: రోటరీ కార్యాలయంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన పేరు మీదే మన అద్దంకిలో సంజీవ నగర్ ఏర్పాటు చేశారని అధ్యక్షులు వీరయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏ.జి.షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీకృష్ణ, జాగర్లమూడి శివ కుమారి, నర్రాశ్రీలక్ష్మి, కాకర్ల వెంకటేశ్వర్లు, బాచిన పూర్ణ చంద్రరావు, అలహరి హరి ప్రసాద్, గురుశేఖర్, పసుపులేటి ఆంజనేయులు, పుట్టంరాజు తులసీదాసు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న దృశ్యం

హెర్బల్ కాస్మెటిక్స్ తయారీలో శిక్షణ

ప్రజాశక్తి-బాపట్ల

హెర్బల్ (మూలిక) సోప్స్, కాస్మెటిక్స్ తయారీపై బాపట్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.నాగమణి శుక్రవారం తెలిపారు. సీవా ఫౌండేషన్, హబ్సిగూడ హైదరాబాద్ సౌజన్యంతో లక్ష్మి సోము బ్లిస్ బ్లూమ్ హెర్బల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాల విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆహార విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ ఎం.సర్దార్ బేగ్, లక్ష్మీ సోము, పారా జ్యోతి, లావణ్య, సిపిడిసి సభ్యులు పి.సి. సాయిబాబు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న దృశ్యం

రోడ్డు వెంట చెత్త తొలగింపు

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని జాళ్లపాలెంలో ఇంకుడు గుంత ప్రారంభించడానికి మంత్రి, కలెక్టర్ రానున్న నేపథ్యంలో కొండపిలోని జాళ్లపాలెం రోడ్డు, టంగుటూరు రోడ్ల పక్కన చెత్త తొలగింపు పనులు చేపట్టారు. గతంలో అపరిశుభ్రతకు నిలయాలుగా మారి ప్రజలకు అసౌకర్యంగా ఉండి వ్యాధులు ప్రభలుతున్నా పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పెద్ద పంచాయతీ అయిన కొండపిలో పారిశుద్ధ్య పనులపై లక్షలాది రూపాయాలు ఖర్చులు చూపిస్తున్న అధికారులు పనులు మాత్రం చేపట్టడం లేదు. ఎక్కడ చెత్త అక్కడ పేరుకు పోయి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారన్న సమాచారంతో పంచాయతీ సెక్రటరీ హడావుడిగా పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను పక్కకు నెట్టి వేసి వాహన రాకపోకలను అంతరాయం లేకుండా చేశారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిపై

ఉపాధ్యాయుడు దాడి

స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి- కురిచేడు



స్తంభానికి కట్టేసి ఉన్న ఉపాధ్యాయుడు

మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిపై ఓ ఉపాధ్యాయుడు దాడి చేశాడు. ఈ ఘటన కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని విప్పై.కాలనీలో శుక్రవారం చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్య నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు రోజుల క్రితం ఓ విద్యార్థి కాళ్లకు బూట్లతో మధ్యాహ్న భోజనం చేస్తున్నాడు. బూట్లు విప్పి భోజనం చేయాలని ప్రధానోపాధ్యాయుడు తెలిపాడు. మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు కూడా బూట్లు విప్పి భోజనం చేయాలని విద్యార్థికి సూచించింది. అయితే అదే పాఠశాలలో పని చేస్తున్న వెంకట రవికుమార్ అనే ఉపాధ్యాయుడు ఈ ఘటనపై కార్మికురాలితో గొడవకు దిగాడు. అనవసర విషయాలలో నీ జోక్యం ఏమిటని ఆమెను దుర్భాషలాడాడు. పాఠశాల సిబ్బంది ఇరువురికి నచ్చజెప్పటంతో వివాదంతో సద్దుమణిగింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వంట చేయడానికి బియ్యం తీసుకుంటున్న కార్మికురాలితో రవి కుమార్ మళ్లీ ఘర్షణ పడ్డాడు. నన్ను కొడతానని చెప్పావు కదా ఎందుకు కొట్టలేదంటూ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. జరిగిపోయిన విషయం గురించి ఇప్పుడు ఎందుకు అని కార్మికురాలు నచ్చచెపుతుండగా చెప్పుతో ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితురాలి గ్రా మంలోకి వెళ్లి జరిగిన విషయం గురించి గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులు పాఠశాలకు చేరుకొని రవికు మార్‌తో మట్లాడుతుండగా వారిపై కూడా దౌర్జన్యానికి దిగాడు. ఆగ్రహించిన గ్రామస్తులు ఉపాధ్యాయుడిని విద్యుత్ స్తంభానికి కట్టివేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గతంలో 2022 డిసెంబర్‌లో మండల ప్రత్యేక అధికారి పాఠశాల తనిఖీకి వచ్చిన సమయంలో ఆమెపై కూడా రవికుమార్ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ప్రత్యేక అధికారిణి జరిగిన సంఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లగా స్పందించిన జిల్లా కలెక్టర్‌ని ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. 6 నెలల తరువాత తిరిగి అదే పాఠశాలలో ఉపాధ్యాయుడి కొనసాగుతున్నాడు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికురాలిపై దాడి ఘటన గురించి ఎంఇఒ ఆర్.వస్త్రాం నాయక్ వివరణ కోరగా ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ శివను వివరణ కోరగా ఇప్పటి వరకూ ఈ ఘటనపై తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

భూ కబ్జాపై సమగ్ర విచారణ జరపాలి

తహశీల్దార్‌కు బాధితుల వినతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

తమ భూమిని నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకొని మా భూమిని మాకు అప్పగించాలంటూ బాధితులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతమాగులూరులోని 171/1 సర్వే నెంబర్‌లో ఏడెకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. అందులో అర్వపల్లి కుటుంబీకులకు పూర్వార్జితంగా హక్కులు కలిగిన భూమి 3.50 సెంట్ల భూమి ఉంది. ఇదే సర్వే నెంబర్‌లో అదే గ్రామానికి చెందిన గుర్రం పుల్లయ్యకు హక్కు కలిగిన కొంత భూమిని కోట సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించాడు. రికార్డుల ప్రకారం ఉన్న భూమి కాకుండా ఇదే సర్వే నెంబర్‌లో తమ పూర్వీకులకు కూడా భూమి ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి 2016లో సుబ్రహ్మణ్యం పేరుతో 3.1 ఎకరం ఆన్‌లైన్ చేయించుకుని పట్టాదార్ పాస్ పుస్తకం పొందాడు. ఆ తరువాత కొంత కాలానికి భూములు తనవేనంటూ సర్వే చేయించి హద్దురాళ్ళు పాతేందుకు ప్రయత్నించగా హక్కుదారులు అడ్డు తగిలారు. సదరు వ్యక్తి కోర్టుకు వెళ్లి తాను పొందిన పుట్టాదార్‌పాస్ పుస్తకం ఆధారంగా తనకు హక్కు కలిగిన భూమి తనకు



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

స్వాధీన పరచాలని రెవెన్యూ వారికి ఆదేశాలు జారీ చేయించాడు. దీంతో రెవెన్యూ అధికారులు పోలీసు రక్షణతో కోట సుబ్రహ్మణ్యంకు హద్దులు వేశారు. అయితే ఇప్పుడు తమకు వారసత్వంగా ఉన్న 3.5 ఎకరాల భూమి ఎక్కడుందో చూపాలని అర్వపల్లి కుటుంబ వారసులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల గ్రామానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి తమ గోడుని వెళ్ళబోసుకున్నారు. సావధానంగా విన్న రవికుమార్ సుబ్రహ్మణ్యంకు ఆ భూములు ఎలా సంక్రమించాయో విచారణ జరపాలని ఆదేశించారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో తమకు న్యాయం చేయాలని బాధితులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కుటుంబ సభ్యులే చంపేశారు..

ప్రజాశక్తి-కంభం



కడం శ్యామ్(ఫైల్)

కంభం గ్రామంలోని మేదర వీధిలో నివాసం ఉంటున్న కడం శ్యామ్ (35) అనే వ్యక్తిని అతని కుటుంబ సభ్యులే కడతేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కడం లక్ష్మీదేకి ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు కడం శ్యామ్‌ను కుటుంబ కలహాల నేపథ్యంలో వీరి పెద్ద కుమారుడు సుబ్రహ్మణ్యం, కాశి, తల్లి లక్ష్మీదేవి ముగ్గురూ కలిసి కడతేర్చారు. మృతదేహాన్ని ముక్కలుగా కట్ చేసి మూడు గోనె సంచులలో కుక్కి వాళ్ల ఇంటికి 200 మీటర్ల సమీపంలో ఉన్న పెద్ద కాలువలో ఈ సంచులను పడేశారు. స్థానికుల సమాచారం మేరకు కంభం సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహపు ముక్కలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్కాపురం డిఎస్‌పి యు.నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఫొటో ఉంది

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పొన్నలూరు



మృతి చెందిన మధుబాబు

పొన్నలూరు గ్రామానికి చెందిన పందిళ్ల మధుబాబు (27) అనే యువకుడు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మధుబాబు తన ద్విచక్ర వాహనంపై పొన్నలూరు నుంచి కందుకూరు వెళుతుండగా మార్గమధ్యంలో కోల్డ్ స్టోరేజ్ వద్దకు వెళ్లేసరికి పొలంలో నుంచి రోడ్డుపైకి ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పొన్నలూరు ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయ సొమ్మును స్వాహా చేసిన..

ఉద్యోగికి రెండేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-ఇంకొల్లు

దేవుని సొమ్ము స్వాహా చేసిన కేసులో దేవస్థాన ఉద్యోగికి రెండు సంవత్సరాల జైలు శిక్ష పడింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. 2017వ సంవత్సరంలో ఇంకొల్లు మండలం, ఇడుపులపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారిగా పనిచేసిన నూతలపాటి శివప్రసాద్ తన విధులలో చేతివాటం చూపి ఆలయ సొమ్ము తన సొంత అవసరాలకు వాడుకున్నట్లుగా అప్పటి ఈవో దామా నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంకొల్లు పోలీసులు 2017లో కేసు నెంబర్ 38/2017 యు/ఎస్ , 409 ఐపిసిగా నమోదు చేసి అభియోగ పత్రాలు పర్చూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో పర్చూరు కోర్టులో నిందితుడిపై నేరం మీద ఋజువు కావడంతో శుక్రవారం నాడు కోర్టు మేజిస్ట్రేట్ శాంతి ముద్దాయి నూతలపాటి శివప్రసాద్‌కు 2 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించినట్లుగా ఇంకొల్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకొల్లు ఎస్సై జి. సురేష్ ముద్దాయికి శిక్ష పడే విధంగా ప్రాసిక్యూషన్‌కు సహకరించగా ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ లక్ష్మి కుమారి కీలక పాత్ర పోషించారు.

సత్యనారాయణ శర్మకు నివాళి

ప్రజాశక్తి-అద్దంకి



సత్యనారాయణ శర్మ (ఫైల్)

పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితులు పి.సత్యనారాయణ శర్మ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణ సమీపంలోని ఒక కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం ఒక పెళ్లికి హాజరయ్యారు. ధనాపేక్ష లేకుండా ఎవరు పిలిచినా శుభకార్యాలకు హాజరై కార్యక్రమాలను నిర్వహిస్తారని ప్రజలు కొనియాడారు. సత్యనారాయణ శర్మకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు సత్యనారాయణశర్మకు ఘనంగా నివాళులర్పించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేషనల్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల

ఏపీ లాక్రోస్ అసోసియేషన్ తరుపున నేషనల్ టోర్నమెంట్‌కి ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి సబ్ జూనియర్ బాయ్స్, సబ్ జూనియర్ గర్ల్స్, సీనియర్ బాయ్స్, సీనియర్ ఉమెన్ విభాగంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో రాజేస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగిన నేషనల్ మీట్‌లో ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సీనియర్ బాయ్స్ సిల్వర్ మెడల్, జూనియర్ బాయ్స్ బ్రోంజ్ మెడల్, జూని యర్ ఉమెన్ బ్రోంజ్ మెడల్ సాధించారు. ఈ విభాగంలో ఫ్రైడ్ స్కూల్ విద్యార్థులు ఇద్దరు ఇండియన్ ఏషియన్ గేమ్స్‌కు సెలక్ట్ అయ్యారు.



చెక్కు అందజేస్తున్న అనగాని శివప్రసాద్

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రేపల్లె

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శుక్రవారం వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మొత్తం రూ.2,25,639 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్న కుమారి

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ఎంపీపీ ప్రసన్న కుమారి

ప్రజాశక్తి-మేదరమెట్ల

కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షులు సాదినేని ప్రసన్నకుమారి మాట్లాడుతూ రాబోయే వేసేవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో మంచి నీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే క్రమంలో వ్యవసాయానికి సంబంధించి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఏవో పి.శ్రీనివాసరావు వివరించారు. ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో పాల్గొనక పోయినప్పటికీ కోరం సంఖ్య ఉంది కాబట్టి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అనేక సమస్యలను గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఆర్.రాజేశ్వరి, జడ్పీటీసీ టి.వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచులు, పిఆర్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బూదవాడలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని బూదవాడలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యాలయం, గొట్టిపాటి యువత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ భాషా పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వైద్య సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.

పిడిఎఫ్ నేత లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

నిస్వార్థ ప్రజా సేవకుడు, నిబద్ధత గల నాయకుడు పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ శుక్రవారం భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. రమాదేవి మాట్లాడుతూ మేధావుల సభకు మేధావులను పంపించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గ్రాడ్యుయేట్లు విజ్ఞతతో ఆలోచించి ఇప్పటికే 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా నిస్వార్థంతో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే కాక ఉద్యోగులకు కార్మికులకు రైతులకు అన్ని విధాల అండగా ఉంటూ ఎక్కడ సమస్య ఉన్న అక్కడ నేనున్నాను అంటూ ఉద్యమాలకు కూతమిస్తూ పోరాడే వ్యక్తి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే నిరంతరం కృషి చేస్తూ ఉంటారని తెలిపారు. ఇప్పటికే గెలుపొందిన ఎమ్మెల్సీల ద్వారా అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మేరకు లక్ష్మణరావుకు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.సుధాకర్, రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొనిగల సుబ్బారావు, చేనేత నాయకులు మురుగుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



వేమూరులో కరపత్రం అందజేస్తున్న కృష్ణమోహన్

వేమూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, పేదలు, పెన్షనర్స్ సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు చుండూరు మండలంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, మండలంలోని అన్ని సచివాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగులను మరియు ఆయా గ్రామాల్లో ఓటర్లను కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈనెల 27న జరుగునున్న కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో ఉపాధ్యాయులు, మేధావులు, నిరుద్యోగులు కోసం కేటాయించబడినా శాసనమండలి స్థానాల్లో ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కేఎస్. లక్ష్మణరావు హిందూ కాలేజ్ లెక్చరర్‌గా పనిచేస్తూ ప్రజక్షేత్రంలో 14 సంవత్సరాలుగా ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉద్యోగులు, కార్మికులు సామాన్య ప్రజల సమస్యలపై గళ విప్పుతున్నారని తెలిపారు. లక్ష్మణరావు గెలుపు ఉద్యోగులు కార్మికులు గెలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు కె.శ్రీమన్నారాయణ, వెంకటరెడ్డి, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో ఓటర్లను అభ్యర్థిస్తున్న రమాదేవి

నిరుత్సాహపరిచిన బెంగళూరు గ్రానైట్ స్టోనా

ఆసక్తి చూపని గెలాక్సీ గ్రానైట్ యజమానులు

గెలాక్సీ స్టాల్స్ ఏర్పాటు లేని వైనం

ప్రజాశక్తి-చీమకుర్తి

బెంగుళూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న ఇంటర్నేషనల్ గ్రానైట్ స్టోన్-2025 నిరుత్సాహపరిచింది. చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌కు పూర్వ వైభవం తెచ్చి అంతర్జాతీయ మార్కెట్లో డిమాండు పెరిగే అవకాశం స్టోన్‌లో ఉంటుందని ఆశించిన యజమానులకు, పాలిషింగ్ యూనిట్ యజమానులకు నిరాశే మిగిలింది. వివరాల్లోకి వెళితే.. గత రెండేళ్లుగా గెలాక్సీ గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో ఆశ జనకంగా మార్కెట్ లేదు. గత 20 ఏళ్లుగా గెలాక్సీ గ్రానైట్‌ను అధికంగా దిగుమతి చేసుకున్న చైనా, గత ఐదేళ్లుగా అంతంతమాత్రంగా దిగుమతి చేసుకుంటోంది. ఇతర దేశాలలో లభించే వివిధ రంగుల గ్రానైట్లను తక్కువ ధరకు దిగుమతి చేసుకొని చైనా వాటి మీదనే ఎక్కువ ఆధారపడింది. ప్రస్తుతం సౌదీ అరేబియా, వియత్నాం, ఈజిప్ట్ లాంటి దేశాలు చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌ను కొంతమేర దిగుమతి చేసుకుంటూ మన గ్రానైట్‌కు మార్కెట్ కల్పిస్తూ వస్తోంది. చీమకుర్తి ప్రాంతంలో లభించే గెలాక్సీ గ్రానైట్ ఎగుమతి చేసే గ్రానైట్ కంపెనీలు అంతర్జాతీయంగా డిమాండ్ లేకపోవడంతో స్థానికంగా మార్కెట్ మీదే ఎక్కువ ఆధారపడింది. ఈ ఏడాది బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ గ్రానైట్ సోనాలో ప్రపంచ దేశాల నుంచి బయ్యర్లు గెలాక్సీ గ్రానైట్ కొనుగోలుపై ఆసక్తి చూపుతారని మన యజమానులు ఆశించారు. అయితే బెంగళూరులో ఈ నెల 12 నుంచి జరుగుతున్న గ్రానైట్ స్టోన్‌లో చీమకుర్తి గెలాక్సీకి సంబంధించిన ఒక్క స్టాల్‌ను కూడా యజమానులు ఏర్పాటు చేయకపోవడం విశేషం. యజమానులు స్టోన్‌లో స్టాల్స్ ఏర్పాటు పట్ల ఆసక్తి చూపడం లేదు. కేవలం ఒక ప్రముఖ గ్రానైట్ కంపెనీ యజమాని మాత్రమే స్టోన్‌కు వెళ్లి, స్టాల్స్‌ను పరిశీలించి వచ్చినట్టు తెలిసింది. గెలాక్సీ గ్రానైట్ విదేశాలకు ఎగుమతి చేసే పలువురు ఏజెంట్లు స్టోన్‌కు వెళ్లారు. అయితే పలు దేశాల నుంచి వచ్చిన బయ్యర్లు గెలాక్సీ గ్రానైట్ పట్ల ఆసక్తి చూపకపోవడం విశేషం. దీంతో బయ్యర్లలో నిరుత్సాహం నెలకొంది. దీనికి కారణం వియత్నాం, ఈజిప్ట్ లాంటి దేశాలు గెలాక్సీ స్లాబుల కంటే, రఫ్ బ్లాకుల కొనుగోలుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఫినిషింగ్ స్లాబుల పట్ల ఆసక్తి చూపటం లేదు. దీంతో ఎగమతి చేసే ఏజెంట్లు, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులు స్టోన్‌తో తమకు ఒరిగింది ఏమీ లేదని నిరుత్సాహపడ్డారు. స్టోన్‌లో కూడా గతంలో మాదిరి ఎక్కువ స్టాల్స్ పెట్టలేదు. పెట్టిన స్టాల్స్‌లో ఇరాన్, టర్కీ మార్బుల్స్, మాన్యుమెంట్స్, రాజస్థాన్ మార్బుల్ మాన్యు మెంట్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. విదేశీ బయ్యర్లు ఈ స్టాల్స్ పట్ల ఎక్కువ ఆసక్తి చూపించి, కొనుగోలుకై ఆర్డర్లు పెడుతున్నారు. మన గెలాక్సీపై ఆసక్తి చూపకపోవడంతో నిరాశతో చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ యజమానులు వెనుతిరిగారు.



ప్రదర్శనకు ఉంచిన స్టోన్స్



హాజరైన చీమకుర్తి గ్రానైట్ యజమానులు

రవాణా రంగాన్ని రక్షించుకుందాం

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-కొత్తపట్నం

రవాణా రంగాన్ని రక్షించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కొత్తపట్నంలో కొత్తపట్నం, మోటుమాల, గుండమాల రూటు ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తోట బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ రవాణా రంగాన్ని రక్షించాలని, కార్మిక హక్కులు కాపాడాలని మార్చి 24న నిర్వహించనున్న చలో పార్లమెంటు కార్యక్రమంలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సమస్యలు, డీజిల్ ధరలు, బీమా ప్రీమియం, టోల్ చార్జీలు తగ్గించాలని, ఆర్టీవో, పోలీస్ అధికారుల వేధింపులు ఆపాలని, మోటార్ వెహికల్ చట్టంలో సవరణలు చేయాలని, బి.ఎన్.ఎస్ చట్టంలో సవరణ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం త్రైమాసిక పన్నులు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకి సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ సోమిరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, వీరాంజనేయులు, నాగరాజు, కొండలు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం బడ్జెట్లో రవాణా రంగానికి కేటాయింపులపై బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి-రేపల్లె

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. శుక్రవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సుచిత్ర మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన లోపాలతో శిశువులకు ముర్రుపాలు పట్టించడంలో తల్లులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ముర్రుపాలతో శిశువుకు వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సంవత్సరం వరకు తల్లులు పిల్లలకు పాలు పట్టాలని సూచించారు. పోషకాహారంపై సరైన అవగాహన లేక ఎంతోమంది అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

కాలం కలిసి రాక..

- పెరిగిన పెట్టుబడులు
- పడిపోయిన ధరలు
- నష్టాల బాటలో పొగాకు రైతులు



పొగాకు మండె

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఈ ఏడాది రైతులకు పొగాకు సాగు కలిసి రాలేదు. సాగుకు ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో ఉన్నప్పుడు అధిక వర్షాలు, చీడపీడలు చుట్టు ముట్టి వారిని నష్టాల ఊబిలోకి నెట్టాయి. పెట్టుబడులతో పాటు చీడపీడల నివారణకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా దిగుబడులు తగ్గడం, గిట్టుబాటు ధర లేక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

4250 హెక్టార్లలో పొగాకు సాగు..

యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో ఈ ఏడాది 4,250 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. ఈ ఏడాది పొగాకు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో కూలీలకు పనులు దొరుకుతున్నాయి. సుమారు 80 రోజుల అనంతరం మొదటి దశ పొగాకు ఆకులు కొట్టారు.

పెరిగిన ఖర్చులు..

ఎకరాకు కోత, ఆకుల అల్లికకు 10 మంది అవసరం.ఒక్కో కూలీకి రూ.500 ఇస్తున్నారు. ఆకులను ఎద్దుల బండిపై కల్లం వద్దకు చేర్చడానికి రూ.2 వేలు బాడుగ అవుతోంది. నారు పెంపకం, గెడం బాడుగ, నాటు కలిపి రూ.8 వేలు, మందుల పిచికారీకి రూ.3 వేలు, 3 సార్లు కోతలు, ఆకులు రవాణా, దండలుగా కట్టడానికి మొత్తం రూ.20 వేలు, పెన్ తయారీ రూ.10 వేలు, బేళ్ల తయారీకిరూ.4 వేలు ఖర్చు అవుతోందని రైతులు తెలిపారు.



పొగాకును తోరణాలుగా కుడుతున్న కూలీలు

భారీగా తగ్గిన దిగుబడి..

చీడపీడల ప్రభావం దిగుబడులపై పడింది. ఎకరాకు 500 నుంచి 600 తోరణాలు వస్తానుకుంటే 300 నుంచి 350 లోపే వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆకుకొట్టడం, తోరణాలుగా కట్టడం, పందిరి వేయడం వంటి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఒక్క తోరణం కుట్టినందుకు కూలికి రూ.30 చెల్లించాల్సి వస్తోంది. అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు మార్కెట్లో గిట్టుబాటు ధర రైతులను వేధిస్తోంది. గతేడాది క్వింటా పొగాకు రూ.12 వేలు పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.8 వేలు మాత్రమే పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ. 12 వేలు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వెంటాడిన చీడపీడలు..

ఈ ఏడాది పొగాకు సాగు ఆరంభం నుంచి రైతులకు కష్టాలు తప్పలేదు. నాట్లు వేయడం, కలుపునివారణ, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు కలిపి ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులైతే కౌలు రూపంలో అదనంగా రూ. 15 వేలు చెల్లించాల్సి వచ్చింది. పైరు రెండున్నర నెల దశలో తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురియడంతో నీటికుట్టు తెగులు సోకి ఆకులు ఎండి పోయాయి. పైరును రక్షించుకునేందుకు రెండు, మూడు దఫాలు క్రిమి సంహారక మందు పిచికారీ చేయాల్సి వచ్చింది. లో ఎదుగుదల నిలిచిపోయింది.

గిట్టుబాటు ధర కల్పించాలి

బాలు నాయక్, రైతు, పిల్లకుంట తాండా



అధిక వర్షాలతో ఈ ఏడాది పొగాకు పంటకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ. 25 వేలు వెచ్చించి మూడు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. అరకొరగా దిగుబడులు చేతికందుతున్నాయి. మార్కెట్లో పొగాకు గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వం క్వింటా రూ. 12 వేల నుంచి రూ. 15 వేల ధర ప్రకారం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

పెట్టుబడులు పెరిగాయి

షేక్ అల్లాబక్షు, రైతు, యర్రగొండపాలెం



ఎకరానికి రూ.14 వేల వంతున కౌలు చెల్లించి ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేశా. ఎకరాకు రూ. 3,500 చెల్లించి నాట్లు వేశాను. రసాయన ఎరువులు, కలుపు నివారణ, పురుగు ఆశించిన పైరును కాపాడుకునేందుకు రెండు దఫాలు క్రిమి సంహారక మందులు పిచికారీ చేశా. దీంతో ఎకరాకు రూ.40 వేలు వెచ్చించా. అధిక వర్షాల కారణంగా కలుపు, తెగుళ్ల ఆశించి పెట్టుబడులు పెరిగాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

బాలోత్సవం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్థానిక పివిఆర్ బాలుర పాఠశాల ఈనెల 16న బాలోత్సవం వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఒకేరోజు నాలుగు వేలమంది విద్యార్థులు పాల్గొనే వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బాలోత్సవం కమిటీ నిర్వాహకులు శుక్రవారం పర్యవేక్షించారు. సైన్స్,కళలు, చిత్రలేఖనంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలకు అవసరమైన వేదికలు, సభా వేదిక, విద్యార్థుల వసతి సౌకర్యాలు తదితర అంశాలను పర్యవేక్షించారు. వేదికలపై నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రదర్శనకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాట్లు గావిస్తున్నారు. విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్ ఏర్పాటుకు సూచనలు చేశారు. బాలబాలికలకు వేరువేరుగా భోజన వసతి కోసం ఐదు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం వందమంది ఎన్‌సిసి, మరో వంద మంది ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, వాలంటరీ బాధ్యతలు అప్పగించారు. మొత్తం కార్యక్రమం విస్తతంగా ప్రచారం చేసేందుకు సోషల్ మీడియా విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు హెల్త్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన వారిలో బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ, అమరావతి బాలోత్సవం కార్యదర్శియ రామరాజు, ప్రధాన కార్యదర్శి కె. సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు, ట్రెజరర్ ఎస్.రవి , కార్యదర్శులు అబ్దుల్లా హై, వి.బాలకోటయ్య, ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసరావు, సిహెచ్.వినోద్ పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న అధికారులు

బిఎడ్ జవాబు పత్రంతో విద్యార్థి ఉడాయింపు

ఘటనపై విచారణ జరిపిన ప్రొఫెసర్ సోమ శేఖర కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

బిఇడి జవాబు పత్రంతో ఓ విద్యార్థి ఉడాయించాడు. ఈ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఒడిస్సాకు చెందిన ఓ విద్యార్థి గిద్దలూరు లోని ఎస్వి డిగ్రీ కళాశాలలో గురువారం పరీక్ష రాశారు. పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రం ఇన్విజిలేటర్‌కు ఇవ్వకుండా తన వెంట తాను బస చేస్తున్న రూముకు తీసుకెళ్లాడు. ఆలస్యంగా గుర్తించిన ఇన్విజిలేటర్ ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్.మూర్తి స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను సమర్పించేందుకు ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సిడిసి డీన్ ప్రొఫెసర్ జి. సోమశేఖర ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని నియమించారు. సోమ శేఖర శుక్రవారం గిద్దలూరు ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలిరెడ్డి, యూనివర్శిటీ పరిశీలకుడు ఒ.జయభారత్ రెడ్డి, విద్యార్థి పరీక్ష రాసిన రూము, ఇన్విజిలేటర్‌తో ఘటనకు ప్రధాన నిందితుడైన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన విద్యార్థిని నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసు కున్నారు. విచారణ నివేదికను వైస్ ఛాన్సలర్ కు అందజేయనున్నట్లు డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సిఇ డాక్టర్ కెవిఎన్.రాజు, పిజి (నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం) కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కళామిత్రమండలి (తెలుగులోగిలి) సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఒంగోలులోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు,ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి శుక్రవారం ఒక్రపకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డివిఆర్.మూర్తి, విశిష్టఅతిథిగా రవిశంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్ విశిష్ట అతిథిగా, సాహితీపోషకులు వీరవల్లి సుబ్బారావు,ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం)రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ , ప్రముఖ కవి గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్,నరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, చందనకవి పోతుల పెద వీరనారాయణ,శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, సాహితీ పోషకులు ఒరుగంటి ప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు. సభలో కర్నూలు జిల్లా రచయిత గద్వాల సోమన్న రచించిన 'పిల్ల తెమ్మెరలు' అనే గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్నకవులు, కళాకారులు, సామాజిక సేవారంగ ప్రముఖులు 32 మందికి తెలుగు భాషా విశిష్ట సేవాసత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వేషధారణ పోటీల విజేతలకు బహుమతి ప్రధానోత్సవం, చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే నత్య ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల బాలకోటయ్య,తన్నీరు బాలాజీ,బీరం అరుణ,జివి. శేషగిరిరావు, కందుల మధు తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక గాంధీనగర్, శివ ప్రసాద్ కాలనీ సచివాలయాన్ని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కొంత మంది సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో హాజరు కాని వారికి షోకాస్ నోటీసులు పంపించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఆస్తి పన్నులు వసూలులో పురోగతి సాధించాలని సిబ్బంది ఆదేశించారు. కమిషనర్ వెంట సంబంధిత ఉద్యోగులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగింపు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రాచర్ల ఎంపిడిఓ సూరే వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించబడ్డాయి. ఈ తనిఖీల్లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి జోసెఫ్ కుమార్ పాల్గొని మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై లోతైన తనిఖీలు, ఆడిట్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా మండలంలోని యడవల్లి, సత్యవోలు, చినగానిపల్లె, గుడిమెట్ల, సోమిదేవిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు. ఈ కార్యక్రమాల్లో రాచర్ల తహశీల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, డీటీ భారతీబాయి, ఎంఈఓలు గిరిధర్‌శర్మ, కోటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, స్వచ్ఛంద సంస్థ ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి లక్ష్మీనారాయణ

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాళ్ళూరు

పోలీస్ స్టేషన్‌లో కేసులను సత్వరం పరిష్కరించాలని దర్శి డిఎస్పి డి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు కేసులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కేసులలో ఇరుక్కున్న బైకులను, ట్రాక్టర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐ వై రామారావు, ఎస్ఐ మల్లికార్జున, ఎఎస్ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాళ్ళూరు

తల్లిదండ్రులు చిన్నారులను గమనిస్తూ వారి కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఒంగోలు మోడరన్ ఐ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ ఎం వెంకటరమణా రెడ్డి అన్నారు. స్థానిక ఎబిసి హైస్కూల్లో శుక్రవారం ఒంగోలు మోడరన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు వెంకటరమణారెడ్డి, డాక్టర్ డి అర్పణ షాషర్ ఆధ్వర్యంలో 619 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 54 మందిని గుర్తించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కె కాలేషాబాబు, పిఆర్ సురేంద్ర, టెక్నిషియన్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వసుంధరాదేవి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-దర్శి

విఓఏలు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని వెలుగు ప్రాజెక్ట్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరదేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏటీఎం రజియాసుల్తాన్ అధ్యక్షతన విఓఏలతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా లూస్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆ యాప్ ద్వారా పనులన్నీ సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. లోన్లు కానీ, బకాయిలు కానీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఎలాంటి పెండింగ్ పనులున్నా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు బాబు, కోటమ్మ, కోటేశ్వరమ్మ, విఓఏలు పాల్గొన్నారు.

ఉచిత పారిశ్రామిక శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యంపై ఫిబ్రవరి 18 నుండి 5 రోజుల పాటు దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

• బిక్కుబిక్కు మంటున్న విద్యార్థులు • తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతున్న స్లాబ్ • భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


మరమ్మతులకు గురైన చెర్లోపల్లి పాఠశాల భవనం


స్లాబ్ పెచ్చులూడిపోయిన చెర్లోపల్లి పాఠశాల భవనం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని చెర్లోపల్లి, రేగులచిలక ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. తరగతి గదిలో స్లాబు పెచ్చులూడిపోయి ఉండటంతో పాఠశాలకు విద్యార్థులు నిరంతరం బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ సమయంలో స్లాబు పెచ్చులూడి పైన పడతాయోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లి చదువుపై దృష్టి పెట్టాల్సిన విద్యార్థులు పైనుంచి సిమెంట్ పెచ్చులు ఊడి తల మీద పడతాయేమోనని తరగతి గదిలో స్లాబును చూసుకునే పరిస్థితి ఏర్పడింది. ఆయా గ్రామాల్లో పాఠశాల తరగతి గదులు నిర్మించి 35 సంవత్సరాలు గడిచాయి. నేటి వరకు ఆ పాఠశాలకు మరమ్మతులు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గత ప్రభుత్వంలో నాడు, నేడు ద్వారా పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినప్పటికీ అధికారులకు మాత్రం శిథిలావస్థకు చేరిన పాఠశాలలు కనిపించలేదు. గత మూడేళ్లుగా ఈ పాఠశాలల్లో మరమ్మతులు చేయాలని కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. గతేడాది నుండి మండల సర్వసభ్య సమావేశంలోనూ ఈ రెండు గ్రామాల పాఠశాల భవనాల గురించి చర్చ జరుగుతూనే ఉంది. ఆయా గ్రామాల సర్పంచులు గలమెత్తి మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అడిగినప్పుడు మాత్రం ప్రపోజల్స్ పంపించామని, వెంటనే మరమ్మతులు చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారే తప్ప ఇంతవరకు ఆ పాఠశాల భవనాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని వారు వాపోయారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అంటూ ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే పిల్లలు చదువుకునే తరగతి గదులన్నీ వర్షపు నీరు కారుతుండటంతో తరగతి గదిలో కూర్చోవడానికి వీలు లేకుండా పోతున్నదని విద్యార్థులు వాపోతున్నారు. చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదిపై భాగం మొత్తం పెచ్చులు పోయి ఉన్నది. ఇనుప చూవ్వలు కనిపిస్తున్నాయి. గోడలు కూడా దెబ్బతినే ఉన్నాయి. కిటికీలు పూర్తిగా తుప్పు పట్టి ఉన్నాయి. పిల్లల్ని బడికి పంపించాలంటే భయం భయంగా ఉంటున్నదని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ పాఠశాల గురించి ఏ అధికారి పట్టించు కోకపోవడం దారుణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రేగులచెలుక పాఠశాల గదులు పూర్తిగా దెబ్బతినే ఉన్నాయి. పాఠశాల వరండా గోడ పూర్తిగా నెరలిచ్చి ఉన్నది. స్లాబ్ పెచ్చులు ఊడి క్రింద పడుతున్నాయి. ఆయా పాఠశాలలో 50 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆయా గ్రామాల సర్పంచులు బత్తుల కృష్ణకుమారి, రమణయ్య, కామనబోయిన రమణమ్మ, వెంకట స్వామి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే పాఠశాలల తరగతి గదులకు మరమ్మతులు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.


రేగులచెలక పాఠశాలలో పలిగిన వరండా గోడ

రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన


రైతులకు సూచనలు ఇస్తున్న ఎడిఎ వెంకటరమణ

ప్రజాశక్తి-సిఎస్.పురం

భూమి ఉన్న రైతులు రైతు సేవ కేంద్రం నందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని కనిగిరి ఎడిఎ ఎగ్గొని వెంకటరమణ తెలిపారు. మండలంలోని రెగులచిలక గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు ఎఒ బి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా 11 అంకెల రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ఫార్మర్ రిజిస్టరీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ అనేది భూమి కలిగిన ప్రతీ రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యని అన్నారు. దీని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం, పారదర్శకంగా మరింత అందుబాటులోనికి తీసుకు రావడం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ పావలి శ్రీనివాసులు, విఎఎ వి చిరంజీవి, పి అనూష, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాళ్ళూరు : భూమి ఉన్న రైతులు రైతు సేవ కేంద్రం నందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు తెలిపారు. మండల కేంద్రమైన తాళ్ళూరులో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పొలం ఉన్న రైతు తప్పనిసరిగా 11 అంకెల రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ఫార్మర్ రిజిస్టరీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. భూమి కలిగిన ప్రతీ రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలు, సులభతరం, పారదర్శకంగా మరింత అందుబాటులోనికి తీసుకు రావడం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విఎఎ నాగరాజు నాయక్, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పీసీపల్లి : ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కె ప్రకాశరావు అన్నారు. రైతు విశిష్ట సంఖ్య నమోదులో భాగంగా పెద అలవలపాడులో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార కార్డు తరహాలో అందిస్తుందని తెలిపారు. ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. రైతులు నమోదు చేసుకోవడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, పంటల కనీస మద్దతు ధర, రుణాలు, వివిధ రకాల వ్యవసాయ, అనుసంద రంగాల సేవలు పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, లేదా వన్ బి అడంగల్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్‌కు లింకైన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రం దగ్గరికి వచ్చి నమోదు చేపించుకోవాలని తెలిపారు. పిల్లివారిపల్లి, శంకరాపురంలో పొలం పిలుస్తున్న కార్యక్రమంలో ఈ రైతు విశిష్ట సంఖ్య నమోదు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పుల్లయ్య, విఎఎ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న పిసిపల్లి ఎఒ కె ప్రకాశరావు

మాజీ ఎమ్మెల్యే 'కదిరి'ని కలిసిన ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావును ఎపిటీఎఫ్ మండల నాయకులు శుక్రవారం శీలంవారిపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కదిరి పెద్దల్లుడు విష్ణుస్వరూప్ అకాల మరణం బాధాకరమని సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం విద్యారంగం అభివృద్ధికి ఎపిటీఎఫ్ బలోపేతానికి తమ సహకారం అందించాలని కోరారు. మండలంలో పాఠశాలల విలీన ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. కదిరి ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. శీలంవారిపల్లెలో జూనియర్ కళాశాల ఏర్పాటుతో ఆర్థిక స్థోమత లేక చదువు మానుకున్న పిల్లలకు ఉచితంగా స్వంత ఖర్చుతో అన్నివసతులు కల్పించడం గొప్ప విషయమని అన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎపిటీఎఫ్ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్‌బాబు, జి రామకృష్ణ, డి సుబ్బారాయుడు, అహ్మద్, సిఆర్‌పి సతీష్, రమేష్ పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కదిరితో ఎపిటిఎఫ్ నాయకులు

చిన్నారులకు ఆధార్ నమోదు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

మండలంలోని అంగన్‌వాడి కేంద్రాల్లోని చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ కృపావరం తెలిపారు. డీజీపేట అంగన్‌వాడి కేంద్రంలోని చిన్నారులకు సచివాలయంలో చేపడుతున్న ఆధార్ నమోదును ఆమె శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మమత పాల్గొన్నారు.


ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

జిల్లా ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పర్చూరు

అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖధికారి ఏ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంగన్వాడీలకు పోషణభి, పడాయిభిపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప విద్యాశాఖాధికారి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు పరచాలని తెలిపారు. పిల్లల్లో పూర్వ ప్రాథమిక విద్య పునాది బాగుంటే పై తరగతుల్లో సులభంగా నేర్చుకుంటారన్నారు. 104 సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏకాంబరేశ్వర రావు గర్భిణులు, బాలింతలు, 0 నుంచి 6 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకి పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో జి.సుభద్ర, ఎంఈఓ-1 ఎం.వి సత్యనారాయణ, ఎంఈఓ-2 పి.వెంకట్రామయ్య, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

భట్టిప్రోలు: అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతానికి కృషి చేయడానికి ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయని అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని జి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఐలవరం ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు పోషణ భి పడాయి భిపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలు పరచాలని తెలిపారు. కొల్లూరులో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఏసీ డిపిఓ విజయ రాణి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, 0 నుండి 6 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకి పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని చెప్పా రు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సంపూర్ణ, విజయలక్ష్మి, మాణిక్యం, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కారంచేడు: పోషణభి, పడాయిభి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కారంచేడు మండలం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ శాలిని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. సూపర్‌వైజర్ హిమబిందు, సునీతలు దత్తత కార్యక్రమం గురించి వివరించారు. రక్తహీనత మీద మరియు బరువు తక్కువ పిల్లల ఎదుగుదలపై వీడియోస్ ఏర్పాటు చేసి వివరించారు. పిల్లల యొక్క ఐదు రకాల అభివృద్ధిని గురించి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు వివరించారు.

బాపట్ల: అంగన్వాడీ కార్యకర్తల్లో బోధన పోషణ పట్ల మరింత సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల సిడిపిఓ శివకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏవివి హైస్కూల్లో రెండు రోజులుగా జరుగుతున్న పోషణ బోధన అనే అంశంపై కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణలో ఆమె పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతుందన్నారు. పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మానసా దేవి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన జన్మించిన శిశువు నుండి ఆరేళ్ల వయసు వరుకు వచ్చే వ్యాధులు నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఇంకొల్లు: పోషణాభి పడాయి బి శిక్షణ రెండో రోజు శుక్రవారం నాడు మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా పోషణాభి గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గెస్ట్ ఫ్యాకల్టీగా స్థానిక వైద్యులు హాజరయ్యారు. పోషణ గురించి రక్తహీనత గురించి, తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారం గురించి, దత్తత ఎలా తీసుకోవాలి అనే అంశంపై మాట్లాడారు. అలాగే రక్తహీనత, బరువు తక్కువ పిల్లలకు సంబంధించి వీడియోస్ చూపించి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీడీపీవో తిరుమల శెట్టి ఝాన్సీ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్: పర్చూరు ఐసిడిఎస్ పరిధిలోని మార్టూరు సెక్టార్ అంగన్‌వాడి కార్యకర్తలకు స్థానిక మద్ది సత్యనారాయణ జడ్పీ హై స్కూల్‌లో సూపర్‌వైజర్ కొప్పెర పద్మ ఆధ్వర్యంలో రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను 1000 రోజుల పాటు సంరక్షించే విధానాన్ని తల్లులకు అవగాహన కల్పించే విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్ వాడి కేంద్ర పరిధిలోని గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు సూపర్‌వైజర్ కొప్పెర పద్మ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పెరాలసిస్‌తో బాధపడుతున్న మహిళకు హెల్పింగ్ హాండ్స్ చేయూత అందించింది. మండల కేంద్రం మార్టూరు నేతాజీ నగర్‌లో నివాసం ఉంటున్న పొట్రు అనురాధ గత కొద్దీ సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ కమిటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ వలి కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం రూ.5 వేలు నగదు, నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హనుమంతరావు కాలనీ మాజీ నెంబర్ కేబుల్ బాషా ఆ మహిళా పరిస్థితి చూసి చలించి వెంటనే రూ. 2 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విశ్రాంత ఎస్ఐ హరిబాబు, పిట్టా అయ్యప్ప స్వామి, పుట్ట వెంకటేశ్వర్లు, సకల ఆంజనేయులు, ఏం జనార్ధన్, షేక్ కాలేషా, చందోలు కాలేషా, రహిమ, దరువుల సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి

ఎమ్మెల్సీ ఎన్నికలకు శిక్షణ

ప్రజాశక్తి-రేపల్లె

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకు, సహాయక పోలింగ్ అధికారులకు రూట్ అధికారులకు మరియు సెక్టార్ ఆఫీసర్లు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రేపల్లె డివిజన్‌లోని 23 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిబద్ధతో పని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, శిక్షణ అధికారి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు 'ఎంటీఎస్' అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్రంలో 2008 నుంచి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎంటిఎస్ పద్ధతికి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఇది సరైన చర్య కాదని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలో సంస్థల పథకాల్లో పనిచేసిన ఉద్యోగులందరికీ కూడా ఎంటిఎస్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగైదు రోజుల క్రితం ప్రభుత్వం సంస్థలు శాఖల్లో పని చేసే ఉద్యోగ వ్యవస్థను రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలని తెలుస్తోందన్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లు గతంలో జీతాలు సరిగా ఇవ్వక, ఇవ్వాల్సిన జీతాలు కంటే తక్కువ జీతాలు ఇవ్వడం ఈఎస్ఐ కట్టకపోవడం వల్ల ఉద్యోగులు అనేకమంది అనారోగ్యం పాలై మరణించినా పట్టించుకునే పరిస్థితి లేకపోవడం మరింత దారుణమన్నారు. ఇటువంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఏర్పాటు చేసి ప్రైవేట్ కాంట్రాక్టర్ల పీడ వదిలించుకోవాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఆప్కాస్ రద్దుచేసి అంశాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అందరికీ ఎంటీఎస్ అమలు చేయమని కోరారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లో పట్టబద్రుల నియోజకవర్గ ఎన్నికల శాసనమండలి ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ టీచర్ పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు సంపూర్ణమైన మద్దతు తెలియజేస్తోందన్నారు. కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వారి సమగ్ర శిక్ష ఉద్యోగులు, కాంట్రాక్ట్, పాలిటెక్నిక్ లెక్చరర్లు ఇతర కాంట్రాక్ట్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అగ్రికల్చరల్ యూనివర్సిటీ సిబ్బంది ఏ.కాంట్రాక్టర్ ఉద్యోగి సమస్యలు ఎదుర్కొన్న ఆ సమస్యల్లో జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఇతర యూనివర్సిటీలు ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని జేఏసీ కోరుతోందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్ పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ మూల్యాంకనం

ప్రజాశక్తి-చీరాల

స్థానిక వై.ఏ.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, చీరాలలో ఈ నెల 15 నుంచి ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు 2024-25 విద్యా సంవత్సరం డిగ్రీ మొదటి సెమిస్టర్ మూల్యాంకనం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూల్యాంకనానికి తెలుగు, ఇంగ్లీష్, సంస్కృతం, ఫండమెంటల్స్ అఫ్ కామర్స్, ఎస్సెన్షియల్స్ అండ్ అప్లికేషన్ అఫ్ మాథమెటికల్ అండ్ ఫీజికల్ అండ్ కెమికల్ సైన్సెస్, ఇంట్రడక్షన్ టు క్లాసికల్ బయాలజీ, బిజినెస్ ఆర్గనైజేషన్, అడ్వాంసెస్ ఇన్ మాథమెటికల్ అండ్ ఫీజికల్ అండ్ కెమికల్ సైన్సెస్, ఇంట్రడక్షన్ టు అప్లైడ్ బయాలజీ స్క్రిప్ట్స్ వచ్చాయని, సంబంధిత ఎక్సమినర్స్ తమ తమ యూనివర్సిటీ స్క్రిప్ట్ వాల్యుయేషన్ ఐ.డి. మరియు రిలీవింగ్ సర్టిఫికెట్స్‌తో నేడు ఉదయం 10 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో జాయిన్ అవగలరని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కారంచేడు

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు కార్డు కోసం రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, సెల్ ఫోన్ సమీప రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. పేర్లు నమోదు చేయించుకొన్న రైతులకు ప్రత్యేక యూనిక్ నెంబర్లతో కూడిన గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. దీని వలన పీఎం కిసాన్, అన్న దాత సుఖీభవ, పంటల బీమా వంటి పథకాలు అందుతాయన్నారు. రైతులు విధిగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన లుక్కా శ్రీనివాసరావు కుటుంబానికి శుక్రవారం గ్రామ టీడీపీ తరుపున నిత్యావసర సరుకులు, దుస్తులు, స్టీల్ సామానులు అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు మోటూరు పుణ్యశ్రీనివాసరావు, సర్పంచ్ బొజ్జ రవి, ఎంపీటీసీ వాక వెంకటనారాయణ, పమిడిముక్కల సాంబయ్య, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, గొట్టిపాటి కృష్ణారావు, పోతర్లంక రాజేష్, కేతవత్ రమేష్, సుంకర కోటేశ్వరరావు తదితర కార్యకర్తలు లుక్కా శ్రీనివాసరావు కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం ద్వారా అన్నివిధాల ఆదుకుంటామన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మహేంద్రనాథ్

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్

ప్రజాశక్తి-వేటపాలెం

మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కటారిపాలెం, వివేకానంద కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల ప్రజలు రోడ్లు, ఇళ్ల స్థలాలు, కరెంటు, మంచినీటి సమస్యలపై మహేంద్రనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దేశాయిపేటలో నిర్వాసిత ప్రాంతాలను పరిశీలించి ప్రజల సమస్యలు తెలుసుకుని త్వరగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగలి వెంకట రామారావు, కీర్తి పూర్ణచంద్రరావు, పోతురాజు, వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ వేమూరి రామ్మోహన్ రావు, వీఆర్వో భాష పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు అన్యాయం

బాపట్ల జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్



సిరాజుద్దీన్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం ముస్లింలకు తీరని ద్రోహం అని బాపట్ల జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటానని వాగ్దానం నేడు ఇలా చేయడం తగతని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అన్నారు. వక్ఫ్ ఆస్తులను జిల్లా కలెక్టర్ల ద్వారా నియంత్రించాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ముస్లిం సమాజాన్ని మోసం చేశాడని మండిపడ్డారు.

భావితరాలకు మార్గదర్శకులు 'సంజీవయ్య'



నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య భావితరాలకు మార్గదర్శకులని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ఉన్న సంజీవయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకష్ణలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంజీవయ్య స్వాతంత్ర సమరయోధుడిగా, రాజకీయ దురంధరునిగా విశిష్ట సేవలందించి దేశ ప్రజలు మన్ననల్ని పొందారన్నారు. పిన్నవయసులోనే తండ్రిని పోగొట్టుకొని కష్టపడి విద్యాభ్యాసం కొనసాగించారని తెలిపారు. 38 ఏటనే తొలి దళిత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏకైక వ్యక్తిగా సంజీవయ్య గుర్తింపు పొందారని తెలిపారు. రెండుసార్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా,కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయన ఉందన్నారు. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సంజీవయ్యకే దక్కిందన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏటా జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున నాయక్ వివిధ శాఖల అధికారులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సివిన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కీర్తి శేషులు దామోదరం సంజీవయ్య 105వ జయంతి శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత సంజీవయ్య చిత్రపటానికి సాహిత్య సాంస్కృతిక కళారంగ ప్రతినిధులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనుమాల రాఘవులు మాట్లాడుతూ తన చివరి క్షణం వరకూ బడుగు బలహీన వర్గాల కోసం, రాష్ట్ర సర్వతో ముఖాభివద్ధికి పాటుపడిన దార్శనికుడని ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని కొనియాడారు. నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో సెంటు భూమి, కారు, బ్యాంక్ బ్యాలెన్స్ లేని నిరాడంబర జీవిగా సంజీవయ్య నేటి తరానికి ఆదర్శనీయులని తెలిపారు. కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా వంశధార, రాయలసీమలో గాజులదిన్నె, గుంటూరు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టులను నిర్మించి లక్షలాది బంజరు భూములను బంగరు భూములుగా మలచిన మహనీయుడని సంజీవయ్య అని పేరొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకష్ణదేవరాయ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, విశ్రాంత ఆదాయపు పన్ను శాఖ అధికారి మెడబలిమి సాంబశివరావు, సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు, అంగలకుర్తి ప్రసాద్, కొప్పోలు వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, పెద్దిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.



నివాళుర్పిస్తున్న బాపట్ల కలెక్టర్ వెంకట మురళి



నివాళులర్పిస్తున్న బాపట్ల ఎస్‌పి తుషార్ డూడి

బాపట్ల జిల్లా : దామోదరం సంజీవయ్య సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105 జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ సంజీవయ్య 1960 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక గొప్ప సంఘటన అని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రిగా సంజీవయ్య రాష్ట్ర అభివద్ధి కోసం అవిశ్రాంతంగా కషి చేసి రాష్ట్రాన్ని అభివద్ధి చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు దామోదరం : ఎస్‌పి

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అని ఎస్‌పి తుషార్ డూడి కొనియాడారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దామోదరం సంజీవయ్య విద్యాభ్యాసం, నిస్వార్ధ రాజకీయ జీవితం గురించి పోలీస్ సిబ్బందికి వివరించారు. మిఠాయిలు పంచి సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కర్నూలు నగరంలో నేడు అంతర్భాగంగా ఉన్న కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఓ సామాన్య నిరుపేద దళిత కుటుంబంలో మునెయ్య, సుంకలమ్మ దంపతులకు 1921 ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య జన్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్, ఎఒ శ్రీనివాసరావు, ఎఆర్‌డిఎస్‌పి విజయసారథి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ ఐ మౌలుద్దీన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దయ చూపరూ..!

- సాయం కోసం ఎదురు చూపు
- రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన వైనం
- ఇంటికే పరిమితమైన నాయబ్ రసూల్

ప్రజాశక్తి-మార్కాపురం

వారిది నిరుపేద కుటుంబం.... సొంత ఇల్లు లేదు... సెంటు స్థలమూ లేదు. సాగు భూమి అసలే లేదు. ఇంటిల్లిపాదీ రెక్కల కష్టంతో జీవనం సాగిస్తున్న కుటుంబానికి రోడ్డు ప్రమాదం పెద్ద కష్టమే తెచ్చిపెట్టింది. ఆ ప్రమాదం ఆర్థికంగా కూడా చిదిమేసింది. అంతే కాదు... చేతికి అందివచ్చిన కుమారుడు రెండు కాళ్లు కోల్పోయాడు. ఆ కుటుంబం దాతల సాయం కోసం.... ప్రభుత్వ సహకారం కోసం ఎదురు చూస్తోంది.

మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన షేక్ రహీం-మస్తాన్‌బీల కుటుంబం పేదరికంలో మగ్గుతోంది. ఆటోతో జీవనం సాగిస్తున్నారు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆటో తోలకంతో వచ్చే ఆదాయంతో రహీం కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఆయన భార్య మస్తాన్‌బీ కూడా కూలీ పనులతో వేడినీళ్లకు చన్నీళ్లు తోడన్నట్లుగా కుటుంబ పోషణలో భాగం పంచుకునేది. పెద్ద కుమారుడు షేక్ నాయబ్ రసూల్ 10వ తరగతి చదివాడు. కరోనా కాలంలో ఉత్తీర్ణులయ్యారు. చిన్న కుమారుడు షేక్ నబీరసూల్ హైస్కూల్ చదువులో ఉన్నాడు. కుటుంబ యజమాని రహీం అనారోగ్యానికి గురయ్యాడు. ఆ సమయంలో ఆటో తోలకం కొనసాగించేందుకు పెద్ద కుమారుడు నాయబ్ రసూల్ ఉపక్ర మించాడు. ఆటో డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఓ రోజు తండ్రి రహీంను గుంటూరులోని వైద్యశాలకు తీసుకెళ్లాల్సి వచ్చింది. కుమారుడు నాయబ్ రసూల్ తమ ఆటోలో గుంటూరుకు వెళ్లారు. తండ్రి రహీంను ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం చేర్చారు. తిరిగి వస్తున్న సమయంలో నరసరావుపేట దాటిన తరువాత బొలోరో వాహనం ఢీకొంది. దీంతె ఆటో నుజ్జయింది. ఆటో నడుపుతున్న నాయబ్ రసూల్ రెండు కాళ్లు పోగొ ట్టుకున్నాడు. పేదరికంలో ఉన్న కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. దాతలు ముందుకు వచ్చారు. వైద్యం కోసం సాయం అందించారు. చేతికి అంది వచ్చిన పెద్ద కుమారుడు నాయబ్ రసూల్ తన రెండు కాళ్లు కోల్పోయాడు. ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యాడు.

ఆటో ప్రమాదంలో పనికిరాకుండా పోయింది. కుటుంబ పోషణ నిమిత్తం మరో కొత్త ఆటో కొనుగోలు చేసే స్థోమత లేదు. చేసేదేమీ లేక అద్దె ఆటోతో నాయబ్ రసూల్ తండ్రి రహీం జీవన పోరాటం సాగిస్తున్నాడు.



రెండు కాళ్లు కోల్పోయిన షేక్ నాయబ్ రసూల్

తల్లి మస్తాన్‌బీ మాత్రం కూలీ పనులకు వెళ్లే పరిస్థితి లేదు. రెండు కాళ్లు కోల్పోయి ఇంటికే పరిమితమైన కుమారుడు నాయబ్ రసూల్‌కు సపర్యలు అందిస్తోంది. అద్దె ఇంటిలో కాలం వెళ్లబుచ్చుతున్నారు. కొద్ది పాటి ఆదాయంతో మూడు పూటలా కడుపు నిండా తిండికీ నోచుకోలేదు ఆ కుటుంబం. దాతలు పెద్ద మనసుతో సాయం చేస్తేగానీ ముందుకు సాగలేమని వాపోతోంది ఆ కుటుంబం. ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో ఆటో అందజేస్తే కుటుంబాన్ని పోషించుకోగలమని ఆ కుటుంబం వేడుకుంటోంది.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

పజాశక్తి - బాపట్ల జిల్లా

భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించినట్లు తెలిపారు. వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ భవనాలపై పడిన వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ఇంకుడు గుంతల కారణంగా భూగర్జ జల మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.16 వేలు చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 261 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిబంధనలు అనుసరించి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. బాపట్ల జిలాలో మొత్తం 256 గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించా లన్నారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎస్‌ఐ రత్నబాబు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.